



కందుకూరి వీరేశలింగం పంతులు

సంఘ సంస్కర్త, యుగపురుషుడు వీరేశలింగం

- రాజమహేంద్రిలోనే మొదటి వితంతు వివాహం
- ఆయన అడుగుజాడల్లో నడిచిన భార్య రాజ్యలక్ష్మి
- నేడు కందుకూరి వీరేశలింగం జయంతి

6

పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ..

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి
- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- లారీని కారు వేగంగా ఢీకొనడంతో ప్రమాదం
- నేడు స్వగ్రామానికి మృతదేహాలు

7

అమలాపురం, రామచంద్రపురం పట్టణాల

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అమలాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ఇద్దరు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కేవీఆర్ఆర్ రాజును రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీచేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వీఐపీ నాయుడును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను విశాఖపట్నం జోన్-1 జోనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.



కాలువలు మూసివేస్తారా.. నీటి విడుదల పొడిగిస్తారా!

ధవళేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డెల్టా కాలువలు మూసివేస్తారా.. లేక నీటి విడుదల పొడిగిస్తారా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. రబీ అనంతరం ఖరీఫ్ సీజన్‌లో నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు క్లోజర్ పనులు చేపట్టేందుకు డెల్టా కాలువలను బుధవారం నుంచి మూసివేయాలని ఇరిగేషన్ అధికారులు గతంలోనే నిర్ణయించారు. అయితే శివారు ఆయకట్టు భూములకు ఇంకా నీటి అవసరత ఉండడం, గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడం తదితర పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. రబీ అవసరాలు తగ్గిన తరువాత గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి మరో నాలుగైదు రోజులు కాల్వలకు నీరు విడుదల చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఎటువంటి సమాచారం లేదు.

నేడు కాలువలు మూసివేస్తాం.. సర్కిల్ ఎస్ఈ గోపినాథ్

డెల్టా కాల్వలను నిర్ణయించిన తేదీ మేరకు బుధవారం నుంచి మూసివేయనున్నాం. కాల్వలకు నీటి విడుదల పొడిగింపునకు ఎటువంటి అభ్యర్థనలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇంత వరకు అందలేదు. కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేయాలని నిర్ణయించడంతో కాల్వలను మూసివేసేందుకు ఇరిగేషన్ సిబ్బంది సిద్ధంగా ఉండాలి.

ఏపీ పీజీసెట్, ఐసెట్‌కు ఉచిత కోచింగ్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్, ఐసెట్ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రాజమహేంద్రవరం ప్రభుత్వ అర్ట్స్ కళాశాల తరపున ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉచిత కోచింగ్ బ్రోచర్ ఆవిష్కరించారు. పీజీ కోచింగ్ కోఆర్డినేటర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ పూర్తి సమాచారం కోసం కళాశాల అధికారిక వెబ్‌సైట్ జీసీఆర్‌జేవై.ఏసీ.ఇన్ సందర్శించాలన్నారు.

పెడితే.. తిరిగి రాధే!

మనీకుమార్..మాయాజాలం

"హాయ్..మీకో బెట్టింగ్ యాప్ చెబుతా.. తెలి సిన వారి ద్వారా ఇందులో పందేలు కాయిస్తే వచ్చిన లాభాల్లో 10 శాతం మీకే.. ఇదిగో యాప్ లింకు.. యూజర్ ఐడీ.. పాస్‌వర్డ్.. మీరే కాదు... మీకు నచ్చినంత మందికి ఇవి షేర్ చేసి ఎంత మందితో ఆడిస్తే అంత లాభాలు" అంటూ కాకినాడకు చెందిన మణికుమార్ అలియాస్ పండు సొంతంగా తయారుచేసిన 'రాధే' అనే బెట్టింగ్ యాప్‌తో రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది బుకీలు, సబ్ బుకీలను నియమించుకున్నాడు.. పోలీసులకు తెలిస్తే తక్షణమే యాప్‌లో అత్యవసర బటన్ ఏర్పాటు చేశాడు.. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కోట్లు లాగేశాడు.



కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరుడు ఘాజీ (పేరు మార్చాం). గడచిన అయిదేళ్లలో కాకినాడ నగరం కేంద్రంగా పేకాట, బెట్టింగ్ యాప్‌లతో సంపాదించింది అక్షరాలా రూ.70 కోట్లు పైమాటే.. రాత్రయితే నగరంలో ప్రముఖులకు ఖరీదైన బస కల్పించి బెట్టింగ్‌లు ఆడించి తెగ నొల్లేశాడు. ప్రభుత్వం మారాక కూడా కొనసాగిస్తుండగా డెన్ బయటపడి ఇప్పుడు రహస్యంగా ఇళ్లల్లో జూదం, బెట్టింగ్ యాప్‌లు ఆడిస్తున్నాడు. అటు పండు అయినా.. ఇటు ఘాజీ అయినా వీరిద్దరి ఘరానా బెట్టింగ్ నిర్వాహకుల తెరవెనుక వెన్నుదన్ను కాకినాడ వైసీపీ కీలక నేతే. ఇటీవల పండు వరంగల్‌లో పట్టుబడితే అక్కడ మంత్రికి ఫోన్ చేసి కేసు నీరుగార్చేలా చేశాడు. - కాకినాడ/ ఆంధ్రజ్యోతి)

కాకినాడలో గతంలో ఎక్కడా బెట్టింగ్‌ల వ్యాపారం పెద్దగా జరిగేది కాదు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా బెట్టింగ్‌లు భారీగా పెరిగిపోయాయి. పై రెండు ఉదాహరణలు చాలు కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో చెప్పడానికి. ఇక్కడి నుంచే వీరిద్దరు కాకుండా అచ్చం వీళ్ల తరహాలో అనేకమంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్‌లో రమ్మీ, క్రికెట్ బెట్టింగ్, కేసినోలు ఆడిస్తూ వేలాది మంది డబ్బు జూదంలో పోగొట్టుకోగా, వీరు మాత్రం కోట్లకు పడగలెత్తారు.

బెట్టింగ్ యాప్‌ల కేరాఫ్ కాకినాడ..

తీగలాగితే డొంక కదిలింది.. కాకినాడ కేంద్రంగా సాగే బెట్టింగ్ ముఠా బయటపడింది. కాకినాడ నగరానికి చెందిన పండు ఏకంగా సొంతంగా రాధే ఎక్స్ఛేంజ్ బెట్టింగ్ యాప్ తయారుచేసి అనేక రాష్ట్రాల్లో బుకీలు, సబ్‌బుకీలను నియమించుకుని కోట్లకు పడగలెత్తాడు. ఇటీవల వరంగల్‌లో దొరికిన బెట్టింగ్ బాబులను లోతుగా విచారిస్తే కాకినాడ కేంద్రంగా పండు సాగించిన బెట్టింగ్ మాఫియా బయటపడింది. దీంతో పండును అరెస్ట్ చేసి విచారిస్తే పండు ఖాతాలో రూ.5 కోట్లు గుర్తించారు. ఇదంతా బెట్టింగ్ ద్వారా సంపాదించినదేనని తేల్చారు. తాజాగా కృష్ణా జిల్లాలోను పట్టుబడ్డ బుకీలను విచారిస్తే అక్కడా సదరు పండు పేరే బయటకు రావడంతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేయబోతున్నారు. అయితే అటు తెలంగాణ, ఇక్కడ కృష్ణాలో పట్టుబడ్డ బెట్టింగ్‌బాబులను అరెస్ట్ చేసి ప్రశ్నిస్తే కాకినాడ కేంద్రంగా వెలుగు చూస్తున్న బెట్టింగ్ దందా చూసి పోలీసులే నివ్వెరపోయి నోరెళ్లబెడుతున్నారు. దీంతో ఇప్పుడు బెట్టింగ్ యాప్‌ల తీగ లాగితే డొంక కాకినాడలో తేలుతుండడంతో పోలీసులంతా అవాక్కవుతున్నారు.

- కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా
- యాప్ తయారు చేయించి కోట్లలో జూదం
- పందేలు కట్టిస్తే లాభాల్లో 10 శాతం వాటా
- బుకీలు, సబ్‌బుకీలు నియామకం
- రాధే ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా కోట్లు
- దందాకు వైసీపీ కీలకనేత అండదండలు
- తీగలాడితే కదిలిన పండు డొంక

ఐదేళ్లు.. రూ.70 కోట్లు కమీషన్..

కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరులు కొందరు ఇళ్లు అద్దెకు తీసుకుని పేకాట నిర్వహించేవారు. కొన్ని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు సదరు నేత కీలక అనుచరుడు నగరంలో జూదరులకు పరిచయం చేశాడు. వారి ద్వారా ఈ యాప్‌ల్లో రోజుకు రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు కూడా పందేలు కాయించేవారు. సదరు వైసీపీ కీలకనేత అనుచరుడికి కమీషన్లు భారీగా రావడంతో రెచ్చిపోయి వ్యాపారం పెంచేశాడు. గడచిన ఐదేళ్లలో సదరు వ్యక్తి పేకాట నిర్వహణ, యాప్‌ల కమీషన్ ద్వారా రూ.70 కోట్ల వరకు సంపాదించాడు. ఇందులో రూ.14 కోట్లతో నగరంలో ఇటీవల ఖరీదైన భవంతిని నిర్మించాడు. అయితే బెట్టింగ్‌ల విషయం తెలిసినా పోలీసులు జోలికిరాకుండా ఉండేందుకు నెలకు లక్షల్లో మామూళ్లు పంపాడు. కొంతకాలం కిందట ప్రభుత్వం మారాక తిరిగి పేకాట ఆడించేందుకు ప్రయత్నించగా దొరికిపోవడంతో ఇప్పుడు యాప్‌ల ద్వారా జూదం కొనసాగిస్తున్నాడు. ఇప్పటికీ ఐపీఎల్, ఇతర క్రికెట్ మ్యాచ్‌లు వస్తే సదరు వ్యక్తి కోట్లలో యాప్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు. ఇటీవల మళ్లీ నగరంలో పలు ఇళ్లను అద్దెకు తీసుకుని యథేచ్ఛగా పేకాట, ఇతర జూదం ఆడిస్తున్నాడు. పోలీసులకు విషయం ముందే చెప్పి మామూళ్లు పంపేస్తున్నాడు.

కోట్లు 'పండు'లా రాలుతున్నాయి..

సదరు ఘాజీతో జూదంలో పరిచయాలు ఉన్న కాకినాడకు చెందిన వీరమణికుమార్ అలియాస్ పండు బెట్టింగ్‌ను వ్యాపారంగా మార్చేశాడు. కాకినాడ కేంద్రంగా రాధే ఎక్స్ఛేంజ్ బెట్టింగ్ యాప్ తయారు చేశాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తెలంగాణ వరకు ఈ యాప్‌ను అనేక మంది బుకీలు, సబ్ బుకీలకు పరిచయం చేశాడు. యాప్‌లో జూదం ఆడిస్తే వచ్చిన లాభాల్లో పది శాతం కమీషన్ ఎర చూపాడు. వీరందరికి యాప్ లింకు, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందించాడు. వీరంతా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విస్తరించేలా చేశాడు. అందులో భాగంగా తను తయారు చేసిన బెట్టింగ్ యాప్‌నకు కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కిరణ్‌కుమార్‌ను అడ్మిన్‌గా నియమించాడు. సదరు అడ్మిన్ పది శాతం కమీషన్ ఆశతో బుకీలు,సబ్ బుకీలను నియమించాడు. కిరణ్ ఇటీవల పోలీసులకు దొరికిపోడంతో పండు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. వరంగల్‌లో పోలీసులకు చిక్కిన కొందరు బుకీలు ఇచ్చిన సమాచారంతో పండు అసలు సూత్రధారుడిగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి బెట్టింగ్ యాప్ ద్వారా వచ్చిన రూ.5 కోట్ల లాభం ఖాతాలో గుర్తించారు. ఇందులో కోటితో ఇటీవల కాకినాడలో ఓ అపార్ట్ మెంట్ కొనుగోలు చేశాడు. అయితే పండు అరెస్ట్‌తో అవాక్కయిన కాకినాడ వైసీపీ కీలకనేత అక్కడ తన పాత పరిచయాలతో ఆ మంత్రితో మాట్లాడి కేసులోతుల్లోకి వెళ్ల కుండా ప్రయత్నాలు చేశారు. సదరు పండు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది బుకీలతో ఇప్పటికీ జూదం ఆడిస్తున్నాడు. సదరు పండు యాప్ ద్వారా రూ.40 కోట్ల వరకు సంపాదించినట్టు సమాచారం. కానీ పోలీసులు ఇదెక్కడా పెద్దగా పట్టించుకోవడంలేదు. వరంగల్‌లో అరెస్టయిన సదరు పండును ఇక్కడా విచారిస్తే ఉమ్మడి జిల్లాలో అనేక ఘోరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ దిశగా పోలీసులు అడుగులు వేస్తారని అనుకోలేం.



ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి



కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగుల్లో అప్పులపాలై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు మండలం పెనకనమెట్టకు చెందిన తాడి వినోద్ (30) ఒరామి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే వర్క్ ఫ్రం హోం పనిచేస్తున్నాడు. ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లో రూ.లక్ష పోగొట్టుకోవడంతో తండ్రి వెంకటేశ్వరరావు మందలించాడు. బెట్టింగ్ గేమ్‌లలో అప్పుల పాలవ్వడంతో ఈనెల 14వ తేదీన కలుపుమందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం అక్కడ నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ బాబూరావు తెలిపారు.

వెన్నులో వణుకు!



గంటిపెదపూడిలో ధాన్యంపై బరకాలను కప్పుతున్న రైతులు

పామర్రు - యండగండి రోడ్డులో బరకాలతో కప్పిన ధాన్యం రాశులు

- వాతావరణంలో మార్పులు.. ఆందోళనలో అన్నదాత
- వర్షపు జల్లులతో ధాన్యం రాశులకు బరకాలతో రక్షణ
- జిల్లాలో ముమ్మరంగా జరుగుతున్న కోతలు
- జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 4,600 ఎకరాల్లో కోతలు పూర్తి

పి.గన్నవరం,ఏప్రిల్15: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణితో వాతావరణంలో ఒక్కసారిగా ఆకస్మిక మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో మాసూళ్ల హడావుడిలో ఉన్న రైతన్నలు ఆందోళనలోపడ్డారు. జిల్లాలో వరి మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో రైతులు చేలల్లో ఉన్న తమ ధాన్యపు రాశులపై బరకాలు, గడ్డి కప్పుకుని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చేసరికి విపత్తుల రూపంలో తమకు నష్టాలు వెంటాడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి రెండో పంటకు సంబంధించి దిగుబడులు ఆశాజనంగా ఉన్నాయని, ఇంతలోనే ప్రకృతి రైతుల పాలిట శాపంగా మారిందని వారు వాపోతున్నారు. ప్రస్తుతం మబ్బులు, వర్షపు జల్లులు భయభ్రాంతులకు గురిచేస్తుండడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా వరి కోతలను రెండు నుంచి మూడ్రోజులు వాయిదా వేసుకోవాలని అధికారులు చెబుతున్నప్పటికీ మొత్తానికే నష్టపోతామన్న భయంతో కొన్నిచోట్ల యంత్రాల ద్వారా రైతులు వరి పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. వాస్తవంగా డిసెంబరు మొదటి వారంలో నాట్లు పూర్తి చేసుకుని మార్చి నెలాఖరుకు కోతలు పూర్తి చేసుకోవాల్సివుంది. కానీ రైతులు ముందు, వెనుకా నాట్లు పూర్తిచేయడంతో సాగునీరును సరఫరాకు అధికారులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. అంతే కాకుండా పంట పూర్తయిన రైతులు సైతం ఒబ్బిడి చేసుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. ముఖ్యంగా రెండో పంటకు 1121, పీఆర్-126, బొండాలు, 111, రకాలను రైతులు ఎంచుకున్నారు. అయితే ఈ రకాల్లో వర్షాలకు, ఈదురుగాలులకు పీఆర్-126 రకం కొంతమేర నేలనంటే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. అలాగే తక్కువ రోజుల్లో పంట చేతికి వచ్చే పీఆర్-126 రకం ధాన్యం ఈసారి మంచి దిగుబడులు వస్తున్నాయని అధికారులు అంచనా వేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కాగా మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆకాశం మేఘావృతం కావడంతోపాటు వర్షపు జల్లులు పడ్డాయి. కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఒబ్బిడి చేసుకున్న ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో పి.గన్నవరం మండలంలో గంటి పెదపూడిలో ఒక్కరోజే 70 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు మండల వ్యవసాయాధికారి కళ్యాణ్‌సూర్యకుమార్ తెలిపారు.

4,600 ఎకరాల్లో కోతలు పూర్తి

రెండో పంటకు సంబంధించి ఈసారి జిల్లా వ్యాప్తంగా వరిరైతులు 1,64,750 ఎకరాల్లో సాగు చేయగా, ఇప్పటివరకు 4,600 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. మండపేట, రాయవరం, రామచంద్రాపురం సబ్‌డివిజన్‌లో పరిధిలో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. ఆత్రేయపురం, సఖినేటిపల్లి, అయినవిల్లి, మల్కిపురం, రాజోలు తదితర మండలాలో కూడా ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యాయి. వచ్చేనెల 20వ తేదీ నాటికి కోతలు పూర్తయ్యే అవకాశం ఉంది. వాతావరణంలో మార్పుల కారణంగా కోతలు విషయంలో జాగ్రత్త వహించాలి. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పర్యటించి ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చుకునే విధంగా రైతులకు వివరిస్తున్నారు. ఈసారి 40 బస్తాలు నుంచి 50 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడే లక్ష్యంగా పెట్టుకున్నాం.

- బోసుబాబు, జిల్లా వ్యవసాయ అధికారి



అయినవిల్లి మండలం విలసలో ఈదురుగాలులకు రోడ్డుపై పడ్డ కొబ్బరిచెట్టును తొలగిస్తున్న దృశ్యం



ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న కొత్తపేట ఆర్డీవో, మైన్స్ ఏడీ

ఐదు మట్టి ట్రాక్టర్లు, ఒక ఇసుక లారీ సీజ్

జొన్నాడలో తనిఖీలు.. ఆర్డీవో, మైన్స్ ఏడీ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు

ఆలమూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న మట్టి, ఇసుక లారీలను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, మైన్స్ ఏడీ వంశీధర్ రెడ్డి సీజ్ చేశారు. జొన్నాడ ఇసుక ర్యాంపును ఆర్డీవో, మైన్స్ ఏడీ మంగళవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ర్యాంపులో ఉన్న ఒక ఇసుక లారీని గుర్తించి సీజ్ చేయగా, హైవేపై నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు మట్టి లారీలను గుర్తించి వాటిని సీజ్ చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అక్రమంగా మట్టి, ఇసుక తరలింపులపై ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు. ర్యాంపులో కేవలం ట్రాక్టర్లు మాత్రమే ఇసుక తరలించాల్సి ఉంటుందని, అయితే లారీలతో తరలింపు చేస్తున్నారని చెప్పారు. ర్యాంపు పరిశీలనలో వారి వెంట ఆలమూరు తహశీల్దార్ ప్రకాష్‌బాబు, మండల సర్వేయర్ ప్రభావతి, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి లారీలు స్వాధీనం

పి.గన్నవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండల పరిధిలో బిల్లులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు లారీలను స్వాదీనం చేసుకున్నట్టు మైన్స్ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం, ఉడిమూడి నదీతీర ప్రాంతాల నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలివస్తున్న మట్టి లారీలను గంటి రోడ్‌లో స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించినట్టు వారు తెలిపారు. ఉన్నతాధికారులతో ఆదేశాల మేరకు నిబంధనలను అనుసరించి సంబంధిత వాహనాలకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో మైన్స్ ఆర్ఐ వి.సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్ అలీ, రెవెన్యూ, మైన్స్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త.. యుగ పురుషుడు
వీరేశలింగం



కందుకూరి వీరేశలింగం తైలవర్ణ చిత్రం

(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

వివిధ సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడు, గొప్ప సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, యుగ పురుషుడు, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆయన గురించి ఈ తరానికి తెలిసింది తక్కువే. ఆయన స్త్రీ విద్య కోసం ఉద్యమించి బాలికల పాఠశాలను కూడా స్థాపించారు. వితంతు పునర్వివాహాల ద్వారా ఆయన గొప్ప ఆదర్శవాదిగా పేరుగాంచారు. 1983లో వచ్చిన ఆంధ్రకేసరి చిత్రంలో రాజమహేంద్రవరం నగర గొప్పతనాన్ని వర్ణిస్తూ 'వేదంలా ఘోషించే గోదావరి' అంటూ ఓ పాట రాశారు.. ఇందులో 'కొట్టుకొని పోయె కొన్ని కోటి లింగాలు... వీరేశలింగమొకడు మిగిలెను చాలు' అని రాశారు గేయరచయిత. అంటే రాజమహేంద్రవరం చరిత్రలో వీరేశలింగం ఎంత ప్రాధాన్యం కలిగిన వ్యక్తి అనేది.. ఒక్క వాక్యంలో చెప్పారు. నేడు ఆయన కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..

- రాజమహేంద్రిలోనే మొదటి వితంతు వివాహం
- ఆయన అడుగుజాడల్లో నడిచిన భార్య రాజ్యలక్ష్మి
- నేడు కందుకూరి వీరేశలింగం జయంతి



రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులు పరిశోధనా కేంద్ర భవనం

1848లో జననం

రాజమహేంద్రవరంలోని సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతులకు 1848, ఏప్రిల్ 16న వీరేశలింగంపంతులు జన్మించారు. సుబ్బారాయుడు తన తండ్రి పేరును కుమారుడికి పెట్టుకున్నారు. వీరేశలింగం పూర్వీకులు దివానులు, రెవెన్యూ ఉద్యోగులుగా పనిచేశారు. వారి స్వస్థలం ప్రకాశం జిల్లా కందుకూరు కాగా వీరు రాజమహేంద్రవరం వలస వచ్చి స్థిరపడ్డారు. క్రమేణా ఊరిపేరే ఇంటి పేరుగా మారింది. వీరేశలింగం పంతులుకు 12ఏళ్ల వయసులో కాతేరుకు చెందిన బాపమ్మ(రాజ్యలక్ష్మి)తో 1861లో వివాహం జరిగింది. 1870లో మెట్రిక్యులేషన్, 1872లో ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత పరీక్ష పాసయ్యారు.

సతీమణి సహకారం

వీరేశలింగం సాంఘిక సంస్కరణోద్యమాల్లో ఆయన సతీమణి రాజ్యలక్ష్మి సహకారం ఎంతో ఉంది. వితంతు వివాహాలపై అప్పటి సమాజంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సహాయ నిరాకరణ చేసేవారు. దీంతో రాజ్యలక్ష్మి స్వయంగా గోదావరి నదికి వెళ్లి నీళ్లు తెచ్చేవారు. తర్వాత నుయ్యి తవ్వించారు.

హితకారిణి సమాజానికి ఆస్తులు

వీరేశలింగం తన ఆస్తులను పాఠశాలల స్థాపనకు, హితకారిణి సమాజానికి, సంఘ సంస్కరణకు వినియోగించారు. తన యావదాస్తిని సమాజానికే వెచ్చించారు. చివరికి తన రచనల ద్వారా వచ్చిన ఆదాయంతో జీవించారు. ఆయన రచనల్లో వెనీస్ వర్తక చరితము, రాజశేఖర చరిత్ర, మార్కండేయ శతకం, సంగ్రహ వ్యాకరణం, రత్నావళీ, సత్యవతీ చరిత్ర, శాకుంతలము, శరీర శాస్త్రము, జంతు స్వభావ చరిత్ర వంటి 50 రచనలను ప్రధాన మైనవి. వివేకవర్ధని, హాస్య సంజీవని, సతీహిత బోధిని, సత్య సంవర్ధని, చింతామణి, సత్యవాదిన, తెలుగు జననం,విద్వన్మనోహారిణి పత్రికల్లో కొన్నింటిని ఆయన స్థాపించి నడపగా.. మరికొన్నింట్లో సంపాదకులు, సహాయ సంపాదకులు బాధ్యతలు నిర్వహించారు.



పురాతన బావి

సంస్కరణలే లక్ష్యంగా..

వీరేశలింగం ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. సమాజంలో ఉన్న దురాచారాలను వ్యతిరేకిస్తూ ఉండేవారు. మతపరమైన, విద్యాపరమైన సంస్కరణలే లక్ష్యంగా బ్రహ్మసమాజాన్ని నెలకొల్పారు. యువజన సంఘాల స్థాపనకు కూడా ఆయనే ఆద్యుడు. తన 33వఏట 1881, డిసెంబరు 11న మొట్టమొదటి వితంతు వివాహాన్ని జరిపించారు. 22ఏళ్ల గోగులపాటి శ్రీరాములు, 12ఏళ్ల గవరమ్మలకు రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో ఈ వివాహం చేయించారు. వితంతు వివాహాల నిర్వహణకు ఆయన 33మంది సభ్యులతో హితకారిణీ సమాజం ప్రారంభించారు. ఆ రోజు నుంచి ఈ సమాజం తరపున 63వివాహాలు జరిగాయి.



కందుకూరి వీరేశలింగం పంతులు పరిశోధనా కేంద్రంలో వితంతు వివాహ వేడుకల బొమ్మల ప్రదర్శన

1919లో అస్తమయం

చెన్నైలోని ఎగ్మూరులో ఉన్న వేద విలాస్‌లో 1919, మే 27న వీరేశలింగం అస్తమించారు. ప్రస్తుతం వీరేశలింగం దంపతుల సమాధులు ఉన్న ప్రదేశం ఒకప్పుడు ఆనంద ఉద్యానవనం అనే వాళ్లు. తన స్నేహితుడైన చల్లపల్లి రంగయ్య పంతులు నుంచి వితంతు శరణాలయం నిర్వహణ నిమిత్తం 1905లో రూ.2వేలకు వీరేశలింగం కొన్నారు.ఈ తోటకు చేర్చి ఉన్న చల్లపల్లి రామయ్య తోటను 1906లో రూ.600కు కొన్నారు.



వీటీ కళాశాల వద్ద కందుకూరి దంపతుల సమాధులు



పరిశోధనా కేంద్రంలో కందుకూరి పుస్తక లైబ్రరీ

వివేకవర్ధినితో చైతన్యం

1874, అక్టోబరు నెలలో వివేకవర్ధని అనే నాలుగు పేజీల మాస పత్రికలను ప్రారంభించారు. దీనిద్వారా అవినీతిపరులపై యుద్ధం చేసేవారు. సాంఘిక దురాచాల నిర్మూలనకు ప్రజలను చైతన్యం చేయడానికి ఈ పత్రికను ఆయుధంగా చేసుకున్నారు. ఈ పత్రిక ప్రచురణకు కింద కంపోజింగ్ ఉంటే పైన గదిలో ఆయన కూర్చుండేవారు. ప్రతులను ఒక తాడుకు బుట్టకట్టి పైకి లాక్కుని సరిచేసి కిందకు పంపించేవా రు. 1885లో ఆయనకు రాజమహేంద్రవరం పురపాలక సంఘ సభ్యుడిగా అవకాశం లభించింది.



అలనాటి అచ్చుయంత్రం



వీరేశలింగం కుర్చీ



పరిశోధనా కేంద్రంలో పెచ్చులూడిన భవనంపైకప్పు

ఆరుగురికి కందుకూరి పురస్కారాలు

- నేడు విజయవాడలో ప్రదానం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ముగ్గురికి, జిల్లాస్థాయిలో 107మంది ప్రతిభ కలిగిన నాటకరంగ కళాకారులు, సాంకేతిక నిపుణులకు ప్రభుత్వం కందుకూరి పురస్కారాలను ప్రకటించింది. వీరిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆరుగురికి జిల్లాస్థాయి పురస్కారాలు దక్కాయి. వీటిని విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం ప్రదానం చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నాటక, సినీ రచయిత డాక్టర్ బుర్రాసాయిమాధవ్ చైర్మన్‌గా 11మంది నాటకరంగ ప్రముఖులతో ప్రభుత్వం నియమించిన ఎంపిక కమిటీ పారదర్శకంగా పురస్కార గ్రహీతలను ఎంపిక చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో రంగస్థల పురస్కారంతోపాటు రూ.1లక్ష నగదు, జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి రూ.10వేల నగదు అందజేసి సత్కరిస్తామన్నారు. కళా, నాటక రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని చెప్పారు. ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. విజయవాడలో జరిగే ఈ కార్యక్రమానికి కళాకారులు, సాంకేతిక నిపుణులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

- పురస్కార గ్రహీతలు వీరే..

ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన కె.సత్తిబాబు, శ్రీలేఖ, కాకినాడ జిల్లాకు చెందిన కాలపురెడ్డి వెంకటరమణ, నటకుమారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ద్రాక్షారామ సరోజలకు జిల్లా స్థాయి పురస్కారాలు దక్కాయి.



గోకార్ట్ రేసింగ్ ట్రాక్‌లో కార్లు

రేస్‌కు రెడీ

కాకినాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో గోకార్ట్ రేసింగ్ ట్రాక్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. మరో రెండు రోజుల్లో యాక్టివిటీస్ ప్రారంభం కానున్నాయి. ఈ రేసింగ్‌కు సంబంధించి సుమారు 11 కార్లు చేరుకున్నాయి. సుమారు ఐదున్నర ఎకరాల్లో ట్రాక్ సిద్ధం చేశారు. పర్యాటకులకు ప్రవేశం ఉచితమని నిర్వాహకులు చెప్పారు.

రేపు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని ప్రజల గోడు వినేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం రాజమహేంద్రవరం రానున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని అల్యూమినియం కాలనీ, తాడితోట, వీరభద్ర నగర్, రైతునగర్, ఆదెమ్మదిబ్బ, శేషయ్యమెట్ట ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించి ఇళ్లులేని పేదలను కలుసుకుంది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను కలిసి పేదలకు ఇళ్ల స్థలాల సమస్యలపై మాట్లాడతారన్నారు. అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదల సమస్యలు,వారి బాధలను ఇప్పటికే తాము తెలుసుకున్నామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, నగర కార్యవర్గ సభ్యులుపి.లావణ్య, త్రిమూర్తులు, నగర సమితి నాయకుడు రామరాజు పాల్గొన్నారు.





బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు, ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐదు బెటాలియన్ల క్రీడాకారులు


క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

- ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు
- కాకినాడలో ప్రారంభమైన ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు
- పాల్గొన్న నాలుగు బెటాలియన్ల క్రీడాకారులు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆరోగ్యంగా ఉండవచ్చని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండెంట్ నాగేంద్రరావు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి వారితో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బెటాలియన్ నుంచి ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పలు క్రీడా పోటీల్లో రాణించారన్నారు. అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. అతిథులు శాంతి కపోతాలు, రంగుల బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. కాకినాడ 3వ బెటాలియన్‌తో పాటు విజయనగరం 5వ బెటాలియన్, మంగళగిరి 6వ బెటాలియన్, విశాఖపట్నం 16వ బెటాలియన్ పోలీస్ క్రీడాకారులు రన్నింగ్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, వాకింగ్, డిస్కస్‌త్రో, చెస్, క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసి స్టెంట్ కమాండెంట్లు బి.చంద్రశేఖర్, ఎస్.మన్మథరావు, ఆర్‌ఐలు అజయ్‌కుమార్, రవిశంకర్‌రా వు, విఠలేశ్వరరావు, ప్రసాద్, బెటాలియన్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు

20 కిలోమీటర్ల వాకింగ్‌లో ఎం.లక్ష్మణ్, బి.చక్రధర్, టి.శ్రీనివాసరావు. 800 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, వి.సూర్యారావు, బి.రవితేజ, 400 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, జి.మురళి, బి.రవితేజ, డిస్కస్‌త్రోలో టి.ధర్మారావు, ఎన్.కృష్ణారెడ్డి, ఎస్.అబ్రహం, జావెలిన్‌త్రోలో వి.శుభకర్, ఎన్.కృష్ణ మూర్తి, ఎస్.అబ్రహం, లాంగ్ జంప్‌లో జి.శ్రీనివాసరావు, వి.సీతారాం, జి.మురళి, షాట్ పుట్‌లో ఎం.రాంబాబు, ఎం.చంద్రశేఖర్, ఎస్.మోహన్‌రావు... ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. చదరంగం, క్రికెట్ సెమీ ఫైనల్స్ బుధవారం జరుగుతాయి.



పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు



షాట్‌పుట్‌లో సత్తా చాటుతున్న క్రీడాకారుడు



పరుగు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



జడ్జి మల్లికార్జునరావుకు వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకులు

శనేశ్వర ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు

కొత్తపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి మంగళవారం హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు కుటుంబ సభ్యులతో విచ్చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామమూర్తి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం జడ్జి కుటుంబీకులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించారు.



కూపర్ భాను అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కూపర్ భాను సేవలు ఆదర్శనీయం

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహాలకు ఉచితంగా స్వయంగా అంత్యక్రియలు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన కూపర్ భాను అంబేడ్కర్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేయడం చాలా సహనంతో కూడిన పని అన్నారు. ఎంతో పెద్ద మనసు ఉంటేనే తప్ప ఇలాంటి కార్యక్రమాలు చేయలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు అవమానం

● శంఖవరంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులు

● భగ్గుమన్న దళిత సంఘాలు ● రోడ్డుపై బైఠాయింపు



అంబేడ్కర్ విగ్రహానికి వేసిన చెప్పుల దండ

శంఖవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘోర అవమానం జరిగింది. ఆగంతకులు మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారు. ఉదయం 6గంటలకు ఈ సంఘటన వెలుగులోకి రావడంతో స్థానిక కాలనీవాసులు, దళిత సంఘాలు భగ్గుమన్నాయి. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఉదయం నుంచి రోడ్డుపై బైఠాయించారు. దోషులను శిక్షించేవరకూ ఆందోళన విరమించేదిలేదంటూ భీష్మించారు. అడిషనల్ ఎస్పీ ఎమ్‌జేవీ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్, డాగ్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. సీసీటీవీని ఫుటేజీని పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు.



శంఖవరంలో రోడ్డుపై బైఠాయించిన దళితులు

24 గంటల్లో పట్టుకుంటాం : ఎస్పీ

ఆందోళనాకారులతో చర్చించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్ నిందితులను పట్టుకునేందుకు 24 గంటల సమయం కోరారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీసీఫుటేజ్, ఇతర సీసీ కెమెరాలను పరిశీలించామని, సెల్ టవర్ ఆధారంగా కూడా వారి ఫోన్లను ట్రేస్ చేస్తున్నామని, నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే దళిత సంఘాల నేతలు, పోలీసులతో కమిటీ వేశామన్నారు. విచారణ వేగవంతం చేస్తామని, నిందితులను పట్టుకునేందుకు సహకరించాలని కోరారు. నిందితులను పట్టుకునేవరకూ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శంఖవరంలోనే ఉంటారని ఆయన తెలిపారు.

నిందితులను గుర్తిస్తే బహుమతి



అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన నిందితులను గుర్తించినవారికి బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్‌ను పోలీసులు విడుదల చేశారు. తెల్లవారుజాము న 3:30 గంటల సమయంలో బైక్‌పై వెళ్తున్న నిందితుల వీడియో సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేసామని పోలీసులు తెలిపారు.



నిరసనకారులతో మాట్లాడుతున్న కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లాం : ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు/శంఖవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన ఘటనను హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని, దీనిపై హోం మంత్రి, జిల్లా ఎస్పీలతో మాట్లాడామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనపై ప్రజలు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు.

ఉమ్మడి జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల్లో

విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన

» అమరావతి ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతిరావు » కాకినాడలో ప్రత్యేక అధికారులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సీతాపతిరావు

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని అమరావతి ప్రణాళిక విభాగం సీనియర్ సలహాదారు డీవీవీ సీతాపతిరావు సూచించారు. కాకినాడ కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అసెంబ్లీ నియోజవర్గాల ప్రత్యేక అధికారులు, ప్రణాళిక యూనిట్ సభ్యులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సేవారంగాలు ఎలా అభివృద్ధి చేయవచ్చో తెలిపే విధంగా యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కొక్క ప్రత్యేక అధికారులకు అనుబంధంగా ఐదుగురు సచివాలయంసిబ్బంది పనిచేస్తారన్నారు. నియోజకవర్గాల్లో ఉన్న అవకాశాలను అనుసరించి వ్యవసాయం, పారిశ్రామికరంగం, సేవారంగాల అభివృద్ధి చెందే విధంగా ప్లాన్ రూపకల్పన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకున్న ఈ నిర్ణయంతో నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 3జిల్లాల అర్థగణాంక అధికారులు త్రినాథ్, అప్పల కొండ, వెంకటేశ్వర్లు, జడ్పీసీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్‌లో పవర్ సెంటర్ స్పెషల్ ఆఫీసర్... సుడిగాలి పర్యటన

మోతుగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ పవర్ సెంటర్ స్పెషల్ ఆఫీసర్ ఏపీ సాంబశివరావు సుడిగాలి పర్యటన చేశారు. సీలేరు కాంప్లెక్స్‌లో పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాలను సోమ,మంగళవారాలు స్థానిక జెన్‌కో అధికారులు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పనితీరుపై ఆరా తీశారు.

విద్యుత్ ఉత్పత్తిపై ఆరా

అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో కొత్తగా కడుతున్న రెండు యూనిట్ల పనులను కూడా పరిశీలించి ఐదు,ఆరు యూనిట్లు ఎప్పటికీ వినియోగంలోకి వస్తాయని అడిగి తెలుసుకున్నారు. సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై జెన్‌కో అధికారులతో చర్చించారు. ఎగువ సీలేరులోని పార్వతినగర్‌లో నూతనంగా నిర్మించే పంప్ స్టోర్ ప్రాజెక్టు ప్రదేశం, డబ్బింగ్‌యార్డు, ఇంటెక్ డ్యాము, రెగ్యులేటర్ డ్యాములను పరిశీలించారు. ఆయన వెంట సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, డీఈటీ వరప్రసాద్, లోయర్ సీలేరు అధికారులున్నారు.



పొల్లూరు వాల్‌హౌస్ పెన్‌స్టాక్ పనులను పరిశీలిస్తున్న ఏపీ సాంబశివరావు

పాస్టర్ ప్రవీణ్‌ది ప్రమాదం కాదు.. హత్యే

ఫేక్ వీడియోలు సృష్టించిన పోలీసులు : మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని.. హత్యేనని.. పోలీసులు ఫేక్ వీడియోస్ లీక్ చేసి వాటినే ఆధారాలుగా చూపించి రోడ్డు ప్రమాదంగా మలిచారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మత మార్పిడి చట్టాన్ని వ్యతిరేకిస్తూ 2022 డిసెంబర్ 15న సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని, ఈ నెల 16న సుప్రీంకోర్టు బెంచ్ వద్ద ప్రవీణ్ పగడాల తన వాదన వినిపించి ఆధారాలు సమర్పించాల్సిఉందన్నారు. బీజేపీ స్పోక్స్ పర్సన్ అశ్విన్‌కుమార్ ఉపాధ్యాయ, అతని అడ్వకేట్ అశ్విని దుబేలు ప్రవీణ్ పగడాల విషయంలో ప్లాన్ చేసి ఉంటారని ఆరోపించారు. ఈ నెల 19న సాయంత్రం కొంతమూరులో ప్రవీణ్‌కు ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఫ్లెక్సీ పెట్టి కొవ్వొత్తులు వెలిగిస్తామన్నారు. ప్రవీణ్ పగడాలది హత్య అని నమ్మేవాళ్లంతా అక్కడకు రావాలని సూచించారు. ఈస్టర్ పండుగ రోజు క్రైస్తవ బరియల్ గ్రౌండ్‌లో ప్రవీణ్ పగడాల ఫ్లెక్సీ పెట్టి కొవ్వొత్తులు వెలిగించాలని ఆయన కోరారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్ పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరమైన ఫొటోలు... డబ్బులివ్వాలని యువతికి వేధింపులు...

ఆలమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో అసభ్యకరమైన ఫొటోలను పోస్టు చేసి వేధిస్తున్న యువకుడిని ఆలమూరు పోలీసులు అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన అమ్మాయితో స్నాప్‌చాట్ ద్వారా కర్నూలుకు చెందిన పడిపోవు హరీష్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో ఆమెతో తరచు ఫోన్ మాట్లాడేవాడు. అప్పుడప్పుడు న్యూడ్ వీడియో కాల్స్ కూడా మాట్లాడుకునేవారు. అయితే ఆ సమయంలో ఆమెకు తెలియకుండా స్క్రీన్‌షాట్‌తో ఫొటోలు తీసేవాడు. ఈ నేపథ్యంలో ఆమెను డబ్బులు కావాలని డిమాండ్ చేయడం ప్రారంభించాడు. ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో ఇన్‌స్టాగ్రామ్‌లో మూడు అకౌంట్లు ఓపెన్ చేసి ఈ ఫొటోలను పోస్టు చేయడంతో ఆ యువతి ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుడి అరెస్టు

14 రోజుల రిమాండ్

ఈ మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ దర్యాప్తు చేసి కర్నూలుకు చెందిన పడిపోవు హరీష్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు ఆలమూరు కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి హరీష్‌కు 14రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు జైలుకు తరలించారు. సోషల్ మీడియా యాప్‌ల పరిచయం ఏర్పడిన వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ అశోక్‌లు సూచించారు.

గోదావరి పుష్కర పనుల్లో నిధుల దుర్వినియోగం

మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కర పనుల్లో నిధులు దుర్వినియోగం ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంటు అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా కొవ్వూరు మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. కొవ్వూరు మున్సిపాల్టీలో పుష్కర నిధులతో చేపట్టిన గోదావరి బండ్ సుందరీకరణ పనుల్లో నిధులు దుర్వినియోగంపై విచారణ అనంతరం జరిమానా కింద అప్పటి మున్సిపల్ ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన పీవీ ప్రభాకరరావు, రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వైవీ నరసింహరావు పింఛను నుంచి 3 శాతం ఒక సంవత్సరం పాటు నిలుపుదల చేయాలని, అలాగే రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ బి.శ్రీధర్ పింఛను నుంచి 3శాతం రెండేళ్లపాటు నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

లారీని ఢీకొన్న అంబులెన్స్

ముగ్గురికి స్వల్ప గాయాలు

దేవరపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నుంచి అంబులెన్స్‌లో పేషెంట్‌ను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు హైవే వద్ద ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం 6గంటలకు ముందుగా వెళ్తున్న లారీని అంబులెన్స్ ఢీకొనడంతో అంబులెన్స్ డ్రైవర్, పేషెంట్, పేషెంట్ బంధువుకు స్వల్పగాయాలయ్యాయి. వారిని మరో అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో అంబులెన్స్



మబ్బులే... మదిదోచేనే..

కాకినాడలో ఓ చోట ఆకాశంలో మబ్బులు అలుముకున్నాయి మనసును దోచే ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా

ఫొటోగ్రాఫర్ -కాకినాడ

పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ...

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

⏮ మరో ముగ్గురి పరిస్థితి విషమం

⏮ లారీని కారు వేగంగా ఢీకొనడంతో ప్రమాదం

⏮ నేడు స్వగ్రామానికి మృతదేహాలు



కారులో ఇరుక్కున్న శ్రీను మృతదేహం



రమణకుమారి, అనూష మృతదేహాలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీను కుటుంబ సభ్యులు ఈ నెల 14వ తేదీన తెలంగాణలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వెళ్లి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి పయమమయ్యారు. జనగామ జిల్లా స్టేషన్ గణాపూర్ మండలంలోని రాఘవపూర్ గ్రామ పరిధిలో జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీని వారి కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సత్తి కుటుంబీకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు తీవ్ర గాయల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీను (50), సత్తి రమణకుమారి (45), సత్తి అనూష(22) అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలను జనగామ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదంలో తీవ్రగా గాయపడిన సత్తి రాజేశ్వరరావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీను, రమణకుమారి, అనూష మృతదేహాలను బుధవారం స్వగ్రామమైన సవరప్పాలెం తీసుకురానున్నట్టు బంధువులు తెలిపారు. సత్తి కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాజుల రామారం ప్రాంతానికి వెళ్లి గత కొన్నేళ్ల క్రితమే స్థిరపడ్డారు.

చనిపోయిందా? చంపేశారా?



రోడ్డుపక్కన కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం

కాళ్లకు పట్టీలు, మెట్టెలు..

తల వద్ద ఖాళీ గాజు సీసా

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన తుప్పల్లో కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యంకావడం కలకలం రేపింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు పంచాయతీ పరిధిలో శ్రీరాంపురం రిజర్వు ఫారెస్టు ప్రాంతం కవలగొయ్యికి వెళ్లే దారిలో తుప్పల్లో మృతదేహం ఉన్నట్టు అదే గ్రామానికి చెందిన కొవులూరి తాతారావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ పి.కాశీ విశ్వనాథం తన సిబ్బందితో ఘటనా ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఒంటిపై లేత గోధుమ రంగు చున్నీ పీలికలు ఉన్నాయి. కాళ్లకు పట్టీలు, మెట్టెలు ఉండడంతో వివాహిత అని గుర్తించారు. ఆమెకు సుమారు 30-35 ఏళ్లు ఉంటాయని, మరణించి 20 రోజులపైనే గడిచి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహం లభ్యమైన చోట ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని పోలీస్ స్టేషన్లకూ సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, వివరాలు తెలిసిన వారు దగ్గరలోని పోలీస్‌స్టేషను, 112కి లేదా 9440796533లో తెలియజేయాలని సీఐ కోరారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో అన్నికోణాల్లో దర్యాప్తు ప్రారంభించామని ఆయన చెప్పారు.

సామూహిక అత్యాచారం జరిగిందా?

మహిళ మృతదేహం పడి ఉన్న స్థితిని గమనిస్తే సామూహిక అత్యాచారం జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల వద్ద మద్యం ఫుల్ బాటిల్ వంటి సీసా, కాళ్లకు సమీపంలో టిన్ బీర్ ఖాళీ డబ్బా ఉండగా శరీరం 80శాతానికి పైగా కుళ్లిపోయి ఎముకలు కనబడుతున్న స్థితిలో ఉంది. పంజాబీ డ్రెస్ ధరించినట్టు తెలుస్తున్నా.. దుస్తులు దాదాపుగా ధ్వంసమైపోయాయి. చున్నీ ఆమె శరీరంపై లేకుండా పక్కన ఉండడం వల్ల ఇంకా కొద్దిగా గుర్తు పట్టే స్థితిలో ఉండి లేత గోధుమ రంగులో కనబడుతోంది. నోరు పూర్తిగా తెరిచి ఉంది. దీంతో సామూహిక అత్యాచారం చేసి చంపేశారనే అనుమానాలు బలపడుతున్నాయి. చున్నీ మెడకు బిగించి చంపేసినట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు వేరే చోట సామూహిక అత్యాచారం చేసి తీసుకొచ్చి ఇక్కడ పడేశారనే చర్చ కూడా నడుస్తోంది. మృతదేహం ఉన్న చోటు రాజానగరం, బొమ్మూరులో ఏ పోలీస్ స్టేషను పరిధిలోకి వస్తుందనే సందేహంపై చాలాసేపు తర్జనభర్జన జరిగింది. చివరికి బొమ్మూరు పోలీసులు కేసు కట్టి దర్యాప్తు ప్రారంభించారు. మిస్సింగ్ కేసులను పరిశీలిస్తున్నారు.

గోదావరిలో గల్లంతయిన యువకుల మృతదేహాలు లభ్యం

పోస్టుమార్టం అనంతరం

కుటుంబ సభ్యులకు అప్పగింత

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో గల్లంతయిన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన మట్టి ప్రకాష్(14), ఉసురుమత్తి రత్నదీప్ అలియాస్ వెస్లీ, రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష(17) ఈనెల 14న సోమవారం గోదావరిలో స్నానానికి కొవ్వూరు మండలం సీతంపేట పంచాయతీ పరిధిలోని చిగురులంక వెళ్లారు. నదిలోతు తెలియక మునిగిపోతుండగా అక్కడే ఉన్న పిల్లి దివాకర్ చూసి రత్నదీప్‌ను రక్షించాడు. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో గాలింపు చర్యలను పర్యవేక్షించారు. నదిలోతు ఎక్కువగా ఉండడంతో మంత్రి ఆదేశాల మేరకు కాకినాడ నుంచి ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో రెండు మృతదేహాలను వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మట్టి ప్రకాష్ తండ్రి కిషోర్‌బాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.



గంధం హర్ష, మట్టి ప్రకాష్ మృతదేహాలు

వివాహిత అనుమానాస్పద మృతి

భర్తే హతమార్చాడంటూ ఆసుపత్రి ముందు మృతురాలి బంధువులు ఆందోళన



మరణించిన నూకరత్నం(ఫైల్)

తుని రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం సీతయ్యపేట గ్రామంలో వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాల ప్రకారం.. సీతయ్యపేట గ్రామంలో గ్రామానికి చెందిన సూరడ నూకరత్నం (26)కు దగ్గర బంధువైన శివతో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత కొద్దిరోజులుగా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్టు మృతురాలు కుటుంబసభ్యులు ఆరోపించారు. మంగళవారం నూకరత్నం భోజనం అనంతరం విపరీతమైన వాంతులకు గురికావడంతో స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మహిళ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కట్టుకున్న వాడే కూరలో విషం కలిపి భార్యను హతమార్చాడంటూ ఆరోపించారు. దీంతో పోలీసులు వచ్చి శవ పంచనామ రిపోర్టు ఆధారంగా మహిళ మరణానికి భర్తే కారణమైతే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన ఆపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

వ్యక్తి మరణం వ్యవహారంలో కేస్ షీట్ వివాదం

కాకినాడ జీజీహెచ్‌లో ఉద్రిక్తత

విచారణ జరుపుతాం: సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి



వీరాంజనేయులు మృతదేహం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మరణం వ్యవహారంలో కేస్ షీట్ వివాదం జరిగి కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన జానా వీరాంజనేయులు (60)కు గతంలో కాలికి దెబ్బ తగిలింది. అతడికి మధుమేహ వ్యాధి ఉండడంతో ఎంతకీ దెబ్బ తగ్గకపోవడంతో గత నెల 27వ తేదీన కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. 30న వైద్యులు కాలి పాదానికి శస్త్రచికిత్స చేశారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు బాగానే ఉన్నాడు. ఆ మర్నాడు అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న అతడికి ఎగ ఊపిరి రావడంతో పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టినట్లు నిర్ధారించి బాధితుడిని మెడికల్ వార్డుకు షిఫ్ట్ చేశారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న వీరాంజనేయులును మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. అక్కడి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వైద్యురాలు డాక్టర్ తన్మయి నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే వీరాంజనేయులు మృతి చెందినట్టు కుటుంబీకులు ఆరోపించి ఆందోళనకు దిగుతున్న సమయంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి వార్డుకు చేరుకుని వీరాంజనేయులు మృతికి కారణమైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని భరోసా ఇవ్వడంతో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు. దీంతో ఆందోళన సద్దు మణిగింది.

అవంతి ఫ్యాక్టరీలో డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సరిత

ఏలేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో అవంతి అఫ్రోజెన్ ఫుడ్స్ ఫ్యాక్టరీలో క్యాంటీన్‌ను జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి సరిత మంగళవారం పరిశీలించారు. ఇక్కడ కలుషిత ఆహారం తిని సిబ్బంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. పరిశ్రమలో తాగునీరు, క్యాంటీన్‌ను సరిత పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం పాలైనవారిలో కొందరు ఫ్యాక్టరీ బయట ఆహారం తీసుకున్నారని, అందుకే ఇలా జరిగి ఉంటుందని పరిశ్రమ సిబ్బంది తెలిపారు. జగ్గంపేటలో ప్రైవేట్ ఆసుపత్రిలో 6మందికి ఇద్దరు మాత్రమే చికిత్స పొందుతున్నారని, 4 మంది డిశ్చార్జి అయినట్టు తెలిపారు. వైద్యులు శ్రీలక్ష్మీ తదితరులున్నారు.

మెట్లపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మెట్లపై నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన కోట లక్ష్మణరావు (30) సోమవారం ఇంటి వద్ద మేడ మెట్లు దిగుతుండగా జారిపడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రత్తిపాడులో పెంకుటిల్లు దగ్ధం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా మంగళవారం ఉదయం పెంకుటిల్లు దగ్ధమై రూ.4లక్షల ఆస్తినష్టం జరిగింది. ఫైర్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు స్థానిక రాజుగారు వీధిలోని రెడ్నం కోటేశ్వరావు, తోట సురేష్‌కు చెందిన పెంకుటిల్లు విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. బీరువాలు, విలువైన సామాగ్రి దగ్ధమయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్థానిక ఫైర్ అధికారి ఎంజీ రత్నరాజు, బి.సూర్యనారాయణ, దుర్గాప్రసాద్‌ల బృందం సంఘటనా స్థలానికి తరలివెళ్లి మంటలు అదుపుచేశారు.

వరుసకు కూతురైన బాలికపై...

మారు తండ్రి లైంగిక దాడికి యత్నం

తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి యత్నించిన మారు తండ్రిపై కేసు నమోదైంది. హైదరాబాద్ కమలాపురి కాలనీలో నివాసముండే ఓ మహిళ భర్తతో విడిగా కుమార్తె(10)తో కలిసి ఉంటుంది. కొన్నేళ్లక్రితం కాకినాడకు చెందిన వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరు సహజీవనం చేయడం ప్రారంభించారు. మహిళ గర్భవతి అయింది. ప్రసవానికి ఆస్పత్రికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె కుమార్తెపై మారు తండ్రి కన్నేశాడు. అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి యత్నించాడు. తప్పించుకున్న బాలిక స్థానికులసాయంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో అత్యవసర ఎల్‌ఆర్
ఉప్పలగుప్తం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలం కొత్తకోటలో 132 కేవీ టవర్ గాలులకు ఒరిగిపోవడంతో ఉప్పలగుప్తం మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి అప్పుడప్పుడు ఎమర్జెన్సీ లోడ్‌రిలీఫ్ అమలు చేస్తున్నారు. దీంతో మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడింది.

ముగిసిన సప్తాహ పూజలు
అల్లవరం ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు అయిలవారి వీధిలో కోదండ రామాలయం వద్ద మంగళవారంతో సప్తాహ మహోత్సవ పూజలు ముగిశాయి. ఆలయకమిటీ ఆధ్వర్యంలో వారం రోజులు కోదండ రామాలయంలో వివిధ భజన మండళ్ల ఆధ్వర్యంలో భజనలు జరిగాయి. రాముని దర్శనానికి, అన్నసమారాధనకు భక్తులుపోటెత్తారు.

ఇళ్ల మధ్య చర్చి నిర్వహణ కుదరదు
తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా
మలికిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కత్తిమండలో కాలనీ మధ్యలో చర్చిను ఒక వ్యక్తి అక్రమంగా నిర్వహిస్తున్నారని కత్తిమండకు చెందిన పలువురు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంవత్సర కాలం నుంచి అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేశామని, నిరసనలు వ్యక్తం చేశామని అయినప్పటికీ శని, ఆదివారాలు, హిందువుల పర్వదినాల్లో బయట వ్యక్తులను తీసుకువచ్చి చర్చిని నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తహశీల్దార్ పి.శ్రీనివాస్, ఎస్‌ఐ పి.సురేష్, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు ఆందోళనకారులతో మాట్లాడారు. గతంలో చర్చి నిర్మాణానికి పంచాయతీకి ఇచ్చిన తీర్మానాన్ని రద్దు చేసినట్టు ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ తీర్మానాన్ని, గతంలో తీసుకున్న చర్యలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడబాల నరసింహారావు, ప్రయోగ నరసింహమూర్తి, ఎ.అర్జున్, కె.ఏడుకొండలు, చింతా శ్యామ్, లంకే తాతాజీ, కె.రఘులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.


చర్చి వద్దని ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జిల్లాలో 31 పాల్ ల్యాబ్‌లు

విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏఎంవో రాంబాబు

ముమ్మిడివరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31పాఠశాలల్లో పాల్ ల్యాబ్‌లు ఉండగా కొత్తగా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 32 ట్యాబ్‌లతో పాల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. ముమ్మిడివరం మండలం రాణేలంక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పాల్ ల్యాబ్‌ను మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, పాల్ ల్యాబ్ డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి కె.నారాయణరావుతో కలిసి మంగళవారం తనిఖీ నిర్వహించారు. నిబంధనల ప్రకారం పాల్ ల్యాబ్ ఏర్పాటు చేశారా లేదా, పాల్ ల్యాబ్ ఏర్పాటు చేయబోయే తరగతి గది ల్యాబ్ ఏర్పాటుకు అనువుగా ఉందా లేదా, పాల్ ల్యాబ్ ఏర్పాటుకు చేసిన ఎలక్ట్రిఫికేషన్ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే తదితర వాటిని నిశితంగా పరిశీలించారు. త్వరలో జిల్లా టెక్నికల్ కమిటీ తనిఖీ చేసిన అనంతరం పాల్ ల్యాబ్‌లో ట్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ఏఎంవో రాంబాబు తెలిపారు. పాల్ ల్యాబ్ చేపట్టిన పనులు నిర్వహించే విధానాన్ని ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ, పాల్ ల్యాబ్ కోఆర్డినేటర్ అన్నపూర్ణలు వివరించారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేత..

సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ ఆధ్వర్యంలో మెడళ్లు, ప్రశంసా పత్రాలను ఏఎంవో పి.రాంబాబు, పాల్‌ల్యాబ్స్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.నారాయణరావుల చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. సైన్స్ ఎక్స్‌పోలో గురుకుల పాఠశాలకు చెందిన బి.జహ్నవి బంగారు, ఆర్.ధనుశ్రీ రజత, ఇ.అమూల్య కాంస్య పతకాలు సాధించినట్టు సైన్స్ ఉపాధ్యాయిని కేపీఎంఎల్ లత తెలిపారు. అలాగే సైన్స్ ప్రాజెక్టు రూపకల్పనలో అత్యున్నత ప్రతిభకనబరిచిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందించారు. పాఠశాలలోసైన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాచిరాజు


అమలాపురంటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన మాచిరాజు రవికుమార్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన శివాలయం వీధిలోని శ్రీసర్వమంగళరామలింగేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. మంగళవారం ఏలూరులోని అంబికా ఫ్లేవర్ కన్వెన్షన్ హాలులో రాష్ట్ర స్థాయి సేవాసంఘ సమావేశం నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన రవికుమార్‌కు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ నియామక ఉత్తర్వులను అందించారు. రెండున్నర దశాబ్దాలుగా బ్రాహ్మణ సమాఖ్యలో అనేక పదవులు చేపట్టి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినట్టు రవికుమార్ తెలిపారు. పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు. సమాఖ్య సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి బ్రాహ్మణ ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర సంఘానికి ప్రధాన కార్యదర్శిగా హెచ్‌కే మనోహర్ రావు వ్యవహరిస్తారన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన
మామిడికుదురు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈదరాడలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలు వివరిస్తూ అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. సదస్సులో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం భూమికి శ్రేయస్కరమన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని అడిషనల్ డీపీఎం కె.సత్యనారాయణ తెలిపారు. రైతులు యెరుబండి లక్ష్మయ్య, యెరుబండి శ్రీను, కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, కుసుమ పద్మ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి
ముమ్మిడివరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి ఏకేవీ మురళీకొండబాబు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో బళ్లగేటు సెంటర్, బస్టాండు సెంటర్, మార్కెట్ సెంటర్, కొండాలమ్మ ఆలయం వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.వెంకన్నబాబు, కేఏఎస్ఎస్ నారాయణ, పీఎస్ఎన్ రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాల బాలికలకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు
మే 1 నుంచి ప్రారంభం
అమలాపురంటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బాలబాలికలకు వేర్వేరుగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. మే 1 నుంచి 31వరకు జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 8నుంచి 14ఏళ్ల వయసు గల 25మంది బాలురు, 25మంది బాలికలకు వేసవి క్రీడాశిక్షణా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రాంతాల వారీగా ఆసక్తి గల క్రీడా అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తులను పూర్తిచేసి అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఉన్న జిల్లా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. క్రీడా ప్రాంగణం, ఎంచుకున్న క్రీడ తదితర వివరాలతో ఈనెల17వ తేదీలోగా సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తులు అందించాలన్నారు. వివరాలకు సెల్ 7993329433ని సంప్రదించాలని సురేష్‌కుమార్ కోరారు.

ఓఎన్జీసీ వైఖరిపై మోకాళ్లపై అర్ధనగ్న నిరసన

మోకాళ్లపై నిలుచుకుని అర్ధనగ్న నిరసన

అల్లవరం ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్లుగా ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల ఓఎన్జీసీ అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గ్రామస్తులు మోకాళ్లపై నిలుచుకుని అర్ధనగ్న ప్రదర్శన చేశారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు కొల్లు విష్ణుమూర్తి, పచ్చిమాల ఏడుకొండలు, నాతి లెనిన్‌బాబు, పినపోతు ప్రకాష్, గుబ్బల నాగేశ్వరరావు, నాగాబత్తుల గోపి, గ్రామస్తులు, మహిళలు నిరసనలో పాల్గొన్నారు.

పోలీసులు గంజాయిపై ఉక్కుపాదం మోపాలి
ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
మలికిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా పెరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి నిర్మూలనకు పెద్దపీట వేసిందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో మాదకద్రవ్యాల నిర్మూలన, శక్తి యాప్ అవగాహన సభలో ఆయన మాట్లాడారు. పోలీసులు గట్టిగా తలచుకుంటే ఏదైనా సాధించవచ్చునన్నారు. నిర్లక్ష్యాన్ని విడనాడి మాదక ద్రవ్యాల నిర్మూలనకు పెద్దపీట వేయాలన్నారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టి శక్తి యాప్ పట్ల ప్రతీ మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. శక్తి యాప్‌తో పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండానే తమ స్మార్ట్‌ఫోన్‌తో పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసిన 7నుంచి 9నిమిషాలలోపు పోలీసు యాక్షన్ ఉంటుందన్నారు. గంజాయితో యువత భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు పిల్లల పట్ల దృష్టి పెట్టాలన్నారు. పోలీసులు రాత్రి సమయంలో గస్తీ పెంచాలన్నారు. ఈనియోజకవర్గంలో 10వేల నుంచి 12వేల మంది గల్ఫ్ దేశాల్లో ఉంటున్నారని, నకిలీ ఏజెంట్ల మోసాలకు గురవుతున్నారని, వీటిపై కూడా పోలీసులు దృష్టి పెట్టాలన్నారు. డీఎస్పీ సుంకర మురళీమోహనరావు మాట్లాడుతూ గంజాయి, శక్తియాప్, మహిళా రక్షణ బృందాలు గురించి వివరించారు. చదువుంటే అన్నీ ఉన్నట్టేనని, పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతిలో ఎక్కువగా ఉందన్నారు. గంజాయి నిశబ్ధంగా విస్తరించిన మహమ్మారి అని అన్నారు. పిల్లల మీద ప్రేమతో తల్లిదండ్రుల కళ్లు కప్పబడుతున్నాయన్నారు. పిల్లలు పాడవడానికి కొంత తల్లిదండ్రులు కూడా కారణమన్నారు. కోనసీమను ప్రశాంత సీమగా ఉంచుదామన్నారు. సభకు విచ్చేసిన యువకులు, యువతులు విద్యార్థులు వివిధ శాఖల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గుబ్బల శ్రీనివాస్, ఎం. చినబాబు, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, మంగెన భూదేవి, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, జిమహేష్‌కుమార్, ఎస్ఐలు పి.సురేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అగ్నిప్రమాదాల నివారణపై విస్తృత ప్రచారం
అమలాపురం టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండోరోజు అమలాపురం అగ్నిమాపక కేంద్ర అధికారి కేవీ మురళీకొండబాబు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆర్టీసీ బస్టాండు, గడియారస్తంభం సెంటర్, హైస్కూలు సెంటర్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ సెంటర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేశారు.


అమలాపురంలో అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఈదురు గాలులతో వర్షం
అయినవిల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కోతలు కోసి ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు పంటలకు చేటు చేస్తాయని రైతులు వాపోతున్నారు. వర్షానికి తోడు గాలి వీయడంతో ముక్తేశ్వరం-అమలాపురం రహదారిపై విలసవద్ద కొబ్బరి చెట్టు విరిగి పడింది. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. స్థానికులు వంజరపు దుర్గారావు, పెండ్ర రమేష్ తదితరులు చెట్టును తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్
యానాం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గోపాల్‌నగర్‌లోని అంబేడ్కర్ విజ్ఞానభవన్ వద్ద మంగళవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానిక ముఖ్యఅతిథిగా మల్లాడి కృష్ణారావు, అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్‌మాధుర్, విజయవాడకు చెందిన ఎస్సీ మోకా సత్తిబాబు, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకనంద, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, స్పోర్ట్స్ అధ్యక్షుడు లంక విద్యాసాగర్, మాజీ సీఐ గూటం శివగణేష్ పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులు కేక్‌కట్‌చేసి జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ వల్లే బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అతిథులను యానాం అంబేడ్కర్ సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, లంక వెంకన్నబాబు, బడుగు బలరాం పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మల్లాడి, ఎంపీ హరీష్

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కుమార్


అంబాజీపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా అంబాజీపేటకు చెందిన దొమ్మేటి వినోద్‌కుమార్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు నుంచి ఆయన ఉత్తర్వులు అందుకున్నారు.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం
యానాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): యానాంలో డంపింగ్ యార్డు సమస్యకు రెండు రోజుల్లో తాత్కాలికంగా పరిష్కారం కానుందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ప్రైవేట్ స్థలంలో చెత్త వేయడానికి చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ప్రైవేట్ స్థలం లీజుకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి అనంతరం ఫైల్ ఎల్‌ఏడీకి చేరిందని మల్లాడి చెప్పారు. రెండు రోజుల్లో స్థలానికి సంబంధించి ఒప్పందం జరుగుతుందన్నారు. అతి త్వరలో డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయడానికి రెండు షెడ్లు నిర్మాణం జరుగుతాయన్నారు. శాశ్వత పరిష్కారం కోసం ఇప్పటికే రీజెన్సీతో పాటు మరో రెండు స్థలాలను అధికారులు పరిశీలించి నివేదిక సిద్ధం చేశారన్నారు. ఐదు రోజుల్లో తాను స్వయంగా ఫైల్‌ను సీఎం వద్దకు తీసుకువెళ్తానన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి
మలికిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఇరుసుమండ సర్పంచ్ వలవల అమ్మాజీ అన్నారు. మంగళవారం ఇరుసుమండలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవధాన్యాల సాగు, భూసారం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, స్వరాజ్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మన మిత్ర క్యాంపెయిన్‌పై అవగాహన
అల్లవరం ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వివిధ శాఖల సేవలు మొబైల్స్ ద్వారా పొందేలా అవగాహన కల్పించాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. బోడసకుర్రు సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించిన అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి విద్యుత్ బిల్లుల చెల్లింపులు, దేవాలయాల దర్శనాలు, ఆర్టీసీ రిజర్వేషన్లు, రెవెన్యూ సేవలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఏవో బి.లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ
అమలాపురం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన చీకురుమెల్లి కిరణ్‌కుమార్ ప్రతిభ చాటి రెండు పతకాలు సాధించాడు. పవర్‌లిఫ్టింగ్ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 74కిలోల మాస్టర్ విభాగంలో ద్వితీయస్థానం, పవర్‌లిఫ్టింగ్‌లో తృతీయ స్థానం సాధించి రజత, కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం జీకే ఫిట్‌నెస్ జిమ్‌లో జరిగిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌ను డి.గోపీకృష్ణ, డాక్టర్ కాండ్రేగుల శ్రీధర్, డాక్టర్ కడలి ప్రసాద్, డాక్టర్ శివఆశీష్, ఎస్.మణికంఠ, డి.మణికంఠ, రమణ తదితరులు అభినందించారు.

పవర్‌లిఫ్టింగ్ నేషనల్ పోటీలకు ముమ్మిడివరం విద్యార్థులు


ముమ్మిడివరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీలైఫ్ జిమ్ విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో దొమ్మేటి వేణుసాగర్ సబ్‌జూనియర్ 105కిలోల విభాగంలో సిల్వర్ మెడల్, బెంచ్‌ప్రెస్‌లో బ్రాంచ్‌మెడల్ సాధించాడు. మే19న మహరాష్ట్ర కొల్హాపూర్‌లో జరిగే నేషనల్ పవర్ లిఫ్టింగ్‌కు అర్హత సాధించినట్టు కోచ్ వాసంశెట్టి నరేష్ తెలిపారు. 93కిలోల సబ్‌జూనియర్స్‌లో డి.రామ్‌చరణ్‌దేవ్, చిటికెన శ్రీనివాస్ కౌశిక్ బ్రాంజ్‌మెడల్స్ సాధించినట్టు కోచ్ నరేష్ తెలిపారు. విజేతలను టీడీపీ నాయకులు గొలకోటి దొరబాబు, డాక్టర్ విజయ్‌కిరణ్, డాక్టర్ దుర్గాతేజ్‌లు పతకాలు, సర్టిఫికెట్లతో అభినందించారు. సందీప్, సైందం వంశీ, కిశోర్, జిమ్ సభ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

సీఎస్ఆర్ నిధులతో సామగ్రి పంపిణీ
అమలాపురం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అమలాపురం వడ్డిగూడెంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహానికి భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం సీఎస్ఆర్ నిధులతో వివిధ రకాల సామగ్రి అందజేశారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎంవీవీఎం కృష్ణ సీలింగ్ ఫ్యాన్లు, నిత్యావసర వస్తువులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ సందీప్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని రాఘవులకు కేటాయించాలి
అంబాజీపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని అంబాజీపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గణపతి వీరరాఘవులకు కేటాయించాలని కూటమి నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో టీడీపీ, జనసేన పార్టీ ముఖ్యనాయకుల సమావేశం సుంకర బాలాజీ అధ్యక్షతన జరిగింది. వీరరాఘవులకు ఛైర్మన్ పదవిని కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సర్పంచ్ జల్లిబాలరాజు, మైపాల తాతాజీ, చిన్నం బాలవిజయరావు, మట్టపర్తి చంద్రశేఖర్, పెదపూడి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, అరిగెల బలరామమూర్తి, అప్పన బాలాజీ, నేదునూరి కల్యాణ్, అధికారపు బాబ్జి, దాసరి చిన్న, మేడి ద శ్రీనివాసరావు, చిన్న, అరిగెల సూరిబాబు, దొమ్మేటి రామారావు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు
ముమ్మిడివరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పోలమ్మ చెరువుగట్టున ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. లోక సంరక్షణార్థం ఆంజనేయస్వామికి ప్రముఖ వైద్యులు నేమాని జగన్మోహన్-సబిత దంపతులు విశేష పూజలు, లక్ష తమలపాకుల పూజ, అఖండ దీపారాధన, ఆంజనేయస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీరామ చిరంజీవాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారికి ఈపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివార్ని దర్శించుకున్నారు.

బీసీ ఉద్యోగుల సేవలు అమూల్యమైనవి
మామిడికుదురు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అందిస్తున్న సేవలు అమూల్యమైనవని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీరవెంకటేశ్వరరావు అన్నారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావు సమకూర్చారు. ఈస్టడీ మెటీరియల్‌ను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌తో పాటు మండల అధ్యక్షుడు నయినాల రఘురామయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. కాపవరపు గోపాలకృష్ణ, కట్టా రవికుమార్, రాయుడు శ్రీనివాస్, నల్లా బాలాజీ, కారాడి నరసింహరాజు, జీవీ రమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం
మామిడికుదురు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గురువారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత శాఖఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. 11కేవీ లైన్ మగటపల్లి, నగరం సబ్‌స్టేషన్ల పరిధిలో గోగన్నమఠం, మగటపల్లి, కొమరాడ, ఈదరాడ, ఆదుర్రు, లూటుకుర్రు, పాశర్లపూడి, పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, మామిడికుదురు, నగరం, మొగలికుదురు, తాటిపాక, పెదపట్నం, అప్పనపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఆక్వా చెరువుల తవ్వకాలను వ్యతిరేకిస్తున్న సీపీఎం
కాట్రేనికోన, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కందికుప్ప పంచాయతీ మిలిటరీపేటలో నవబుద్ధ గ్రామాన్ని ఆనుకుని ఆక్వా చెరువుల తవ్వకాలను స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. గ్రామస్తులకు మద్దతుగా సీపీఎం బృందం మంగళవారం గ్రామాన్ని సందర్శించింది. నాయకులకు చెప్పినా తమను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు సీపీఎం నాయకుల వద్ద వాపోయారు. మిలిటరీపేటను ఆనుకుని ఉన్న ఆక్వా చెరువులన్నిటినీ నిలిపి వేయాలని నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం చేసి సమస్యను పరిష్కరించుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్, విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ
ముమ్మిడివరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు అయినవిల్లి మండలం పున్నంమెరక పాఠశాల సెకండ్ గ్రేడ్ టీచర్ మీసాల వెంకటరమణ మంగళవారం రూ.10వేలు విలువైన ప్రింటర్‌ను అందించారు. వెంకటరమణ భార్య రాజ్యలక్ష్మి గతంలో స్కూలు అసిస్టెంట్‌గా పనిచేసి మృతిచెందారు. ఆమె జ్ఞాపకార్థం వెంకటరమణ ప్రింటర్‌ను హెచ్‌ఎం బి.హనుమంతరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మిరియం బీబీ, ఎస్.రాంబాబు, కె.రాజబాబు, బి.సుబ్బారావు, సీఆర్పీ శ్రీనుబాబు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో భక్తుల పూజలు
అయినవిల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నల్లచెరువులో గల శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు పూజలు చేశారు. మంగళవారం సౌభాగ్య వ్రతం, చూర్ణోత్సవం, అభిషేకం, అవభృదోత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణ, ఏకాంత సేవ, పూర్ణాహుతి, అన్నసమారాధన నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయా పూజా కార్యక్రమాల్లో గణేశుల వెంకటేశ్వరరావు-వెంకటసూర్యపద్మావతి, గణేశుల వంశీవికాస్-ప్రీతి దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. జిల్లాపరిషత్ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, కళ్లేపల్లి సుబ్బరాజు, వర్రే శ్రీనివాస్, రావూరి వెంకటరత్నం, పరమట సత్యనారాయణ, సీహెచ్ విశ్వనాథరాజు, కాకిలేటి నాగరాజు, వర్రే శేషు తదితరులు స్వామివార్ని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం
అంతర్వేది, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు అధినేత నల్లా సత్యకిరణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, రూ.2వేలు నగదు, బియ్యం అందజేశారు. శ్రీలక్ష్మీనరసింహ యువత ప్రోద్బలంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, అయినపర్తి ఏసు, శకరంగుప్తం నాని తదితరులు పాల్గొన్నారు.

అరుణకు రూ.10వేలు సాయం
అంతర్వేది, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో గుర్రంవారి గ్రూపులో పక్షవాతంతో బాధపడుతున్న గుర్రం అరుణకు దొండపాటి శశికిరణ్ తల్లి, జడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ మంగళవారం రూ.10వేలు అందించారు. ఖతర్‌లో ఉంటూ ఎంతోమందిని ఆదుకుంటున్న శశికిరణ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దొండపాటి శ్రీనివాస్, కందికట్ల మహేష్, నల్లి రాజశేఖర్, నేతల ప్రకాష్, కుక్కల శ్యామ్‌ప్రసాద్, దొండపాటి పూర్ణప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మురుగులమ్మ అమ్మవారి తీర్థం
అంబాజీపేట, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఇరుసుమండ గ్రామదేవత శ్రీమురుగులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి గరగనృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

రాజమ్మ తల్లికి చీర, సారె సమర్పణ
ఉప్పలగుప్తం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భీమనపల్లిలో మంగళవారం రాజమ్మతల్లి తీర్థం వైభవంగా జరిగింది. రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం డైరెక్టర్ కంకటాల రామం దంపతులు ఆధ్వర్యంలో అమ్మవారికి సంప్రదాయ పద్ధతిలో చీర, సారె సమర్పించారు. ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న సమయంలో గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వరదా శ్రీరామచంద్రమూర్తి, వరదా రమేష్, కంకటాల సుమంత్, గాదె రామం, గాదె మణికంఠ, పద్మనాభం దుర్గారావు, కంకటాల సురేష్, మునుకోటి సూరిబాబు పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ
అంతర్వేది, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో భారతరత్న యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని యూత్ సభ్యులు పేర్కొన్నారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమాలు
అమలాపురం టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అన్నపూర్ణమ్మగా కీర్తించబడుతున్న శ్రీమతి డొక్కా సీతమ్మ స్ఫూర్తితోనే కోనసీమ ఆహార నిధిని ఏర్పాటుచేసినట్టు అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ తెలిపారు. కోనసీమ ఆహారనిధిని ఏర్పాటుచేసి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రోగులు, బంధువులకు అన్నదానం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు కార్యక్రమాన్ని ప్రారంభించి ఆహారనిధి ప్రతినిధుల బృందాన్ని అభినందించారు. వలవలశివరావు, గట్టెం వీరు, పోలిశెట్టి పవన్‌మహేష్, వెదుళ్లపల్లి అయ్యప్ప, చీకట్ల కిరణ్, వెంకటేష్, కుసుమ శ్రీను, పవన్‌సాయి, దోసూరి కాశీ, రేళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

టెండర్ ప్రకటన
Rc.No.B4/73/2025 Dt. 07-04-2025

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, అప్పనపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానం నందు ది. 05-06-2025 నుండి ది. 09-06-2025 వరకు శ్రీ స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవములు సందర్భముగా కళ్యాణ ఆహ్వాన పత్రిక మరియు కరపత్రములు ముద్రణ, దేవాలయ ప్రాంగణము మరియు దేవాలయములపై ఎలక్ట్రికల్ డెకరేషన్ చేయుటకు, కళ్యాణము ఐదు రోజులు కళ్యాణ మహోత్సవము నందు ఫోటో మరియు వీడియో షూటింగ్ తీయుటకు శ్రీబాల బాలాజీ స్వామివారి వెలసిన ఆలయం, ప్రతిష్ఠ ఆలయం, తూర్పు దక్షిణం గోపురములు మరియు ఉత్తర ద్వారం, ఆలయంలో ముఖ మండపంలకు తాజా పువ్వుల అలంకరణ కొరకు ఐదు రోజులు కావలసిన పూలు, పూలదండలు, విఐపిలకు సాధారణ దండలు రవాణాచార్జీలతో కలిపి సరఫరా చేయుటకు అనుభవం గల వ్యాపార సంస్థల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. సీల్డ్ టెండర్లు ది.24-04-2025, గురువారం ఉదయం 11 గంటలకు టెండరు బాక్సు నందు దాఖలు చేయవలెను. అదే రోజు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో సదరు సీల్డ్ టెండర్లు తెరవబడును.

1. శ్రీస్వామి వారి తిరు కళ్యాణ ఆహ్వాన పత్రిక మరియు కరపత్రములు ముద్రించి దేవస్థానము వద్దకు చేర్చుటకు
2. శ్రీస్వామి వారి కళ్యాణము ఐదు రోజులు దేవాలయ ప్రాంగణము మరియు దేవాలయములపై ఎలక్ట్రికల్ డెకరేషన్ చేయుటకు
3. శ్రీ స్వామివారి కళ్యాణము ఐదు రోజులు కళ్యాణ మహోత్సవము నందు ఫోటో మరియు వీడియో షూటింగ్ తీయుటకు
4. దేవస్థానమునకు టెండర్‌దారులు స్వయంగా వచ్చి ఆలయ అధికారులు చూపించిన స్థలములు నందు పూల అలంకరణలు పరిశీలించి టెండర్ దాఖలు చేయవలెను.
5. టెండర్ దారులు రూ. 10,000/-లు ధరావత్తు చెల్లించి టెండర్లు పాల్గొన వచ్చును ఆమోదించబడిన టెండర్ దారుని ఆఖరి బిల్లు చెల్లింపు సమయంలో ధరావత్తు సొమ్ము వాపసు ఇవ్వబడును.
6. ది.24-04-2025 ఉదయం 10 గంటల వరకు రూ. 1000/-లు చెల్లించి టెండర్ షెడ్యూలు పొందవచ్చును.
7. టెండర్ షెడ్యూలుతో ఆధార్ కార్డు మరియు పాన్‌కార్డు జిరాక్స్ జతపరిచిటెండర్ బాక్స్ నందు దాఖలు చేయవలెను.
8. ఇతర వివరములు టెండర్ షెడ్యూలులో పొందవచ్చును మరియు కార్యాలయం పని చేయు వేళలలో 7207240444 నెంబర్‌కి కాల్ చేసి తెలుసుకోనవచ్చును.

అప్పనపల్లి
07-04-2025

సం/- ముదునూరి సత్యనారాయణరాజు
కార్యనిర్వహణాధికారి

మండపేట

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.59లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులతో రద్దీనెలకొంది. నేము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,59,462 వచ్చినట్టు ఉపకమిష నరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. పకుకుమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖ జిల్లా గాజువాకకు చెందిన నూక వెంకట గణేశ్వరావు, జ్యోతి గణేష్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.50,117 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం కృషి



పేకేరులో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసంశెట్టి సత్యం, ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. మంగళవారం ఆయన కెంగవరం, పేకేరు గ్రామాల్లో కుట్టుశిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మాట్లాడారు. నియోజకవర్గంలో బీసీ కార్పొరేషన్ ఫైనాన్స్ వెల్ఫేర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆరు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలకు శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంపొందిస్తామన్నారు. 75 శాతం హాజరు ఉన్న మహిళలకు శిక్షణ దినరోజు కుట్టు మిషన్‌తో పాటు, ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీవో ఎన్.శ్రీనివాస, కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, మరిపాది సూరిబాబు, ఎం.రవికుమార్, చలగళ్ల నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, నల్లారి రమేష్, నేమాని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో చెరువుల తవ్వకాలకు ఏర్పాట్లు



ఆలమూరులో ఉపాధి హామీ పథకంలో తవ్వకానికి సిద్ధం చేసిన చెరువు

ఆలమూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల పూడికలు తీయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండలంలో ఈ ఏడాది మూడు చెరువులు ఈ వేసవిలో తవ్వకాలు చేయడానికి సిద్ధం చేస్తున్నారు. పెదపళ్ల, చినపళ్ల గ్రామాల్లోని చెరువుల పూడిక తీయడానికి ఇప్పటికే అనుమతులు వచ్చాయి. ఆలమూరు బోజి చెరువు తవ్వకానికి ప్రతిపాదనలు పంపించారు. చెరువుల తవ్వకానికి దాదాపుగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు ఉపాధి హామీ పథకం అధికారులు అరుణకుమారి, ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే పెదపళ్ల, చినపళ్ల చెరువులు సిద్ధం చేశామని ఆలమూరు చెరువుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు వారు తెలిపారు. అనుమతి రాగానే ఆలమూరు పనులు ప్రారంభిస్తామన్నారు.

ద్రాక్షారామ సరోజకు కందుకూరి విశిష్ట పురస్కారం



ద్రాక్షారామ సరోజ

ద్రాక్షారామ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారిణి, సినీనటి ద్రాక్షారామ సరోజ కందుకూరి విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి పురస్కరించుకుని ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ కమిటీ ద్వారా కందుకూరి రంగస్థల పురస్కారాలకు కళాకారులను ఎంపిక చేసింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి జిల్లాస్థాయిలో కందుకూరి విశిష్ట పురస్కారానికి ఆమె ఎంపికయ్యారు. విజయవాడ 16న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో ఆమెకు పురస్కారం అందజేస్తారు.

ఎంపిక సంతోషం కలిగించింది: కందుకూరి పురస్కారానికి ఎంపిక కావడం సంతోషం కలిగించిందని ఆమె తెలిపారు. కందుకూరి పురస్కారానికి ఎంపికైన ఆమెను ద్రాక్షారామ నాటక కూపరిషత్ అధ్యక్షుడు, హసన్ బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, ఉపాధ్యక్షుడు వైవీవీ సత్యనారాయణ, కోశాధికారి మేడపల్లి దొరబాబు, సహాయ కార్యదర్శి అయినవిల్లి నటీ షాబాబు, సినీ నిర్మాత, నటుడు, కెమెరామెన్ ఆళ్ల రాంబాబు తదితరులు అభినందించారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి, పృథ్వీ తదితరులు

మండపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండపేటలోని 27వ వార్డులో ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగింది. ఆలయంలో స్వామివారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అన్న సమారాధనలు: మండపేటలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో పలుచోట్ల అన్న సమారాధనలు జరిగాయి. మెయిన్ రోడ్డులో ఉన్న రామాలయం వద్ద, కేపీరోడ్డులో ఉన్న బైర్లంపేట రామాలయం వద్ద ఆధ్వర్యంలో అన్న సమారాధనలు జరిగాయి.

బీఎస్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీదేవి బాధ్యతలు స్వీకరణ

రాయవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్ఎస్ఎస్) రాష్ట్ర కార్యదర్శిగా వెదురుపాక గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరులో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ అధ్యక్షత జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె ఆమె మాట్లాడారు. తొలుత శ్రీదేవిని సంఘ సభ్యులు సత్కరించారు.



బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య కార్యదర్శి శ్రీదేవిని సత్కరిస్తున్న దృశ్యం

బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రమణమూర్తి నియామకం



కార్యదర్శిగా ఎన్నికైన రమణమూర్తి సత్కరిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య కార్యవర్గం ఎన్నిక మంగళవారం ఏలూరు అంబికా ప్యాలెస్‌లో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికైన సభ్యులంతా హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా ర్యాలి జగన్నాథ కేశవస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి బీహెచ్వీ రమణమూర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం ఆయన్ను సంఘ సభ్యులు సత్కరించారు.

నూకాంబిక అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే పూజలు

ఆలమూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారిని మంగళవారం కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని దర్శనానికి వచ్చిన ఆయనకు మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆలయం వద్ద కలిశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, వైసీపీ నాయకులు నామాల శ్రీనివాస్, తమ్మన శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఘనంగా మురుగులమ్మ తీర్థం

అంబాజీపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇరుసుమండ గ్రామదేవత శ్రీమురుగులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి గరగనృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన

ఆలమూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దాళ్వా పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతున్న సమయంలో వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన మొదలైంది. నాలుగైదు రోజులుగా తరచూ ఈదురుగాలులు వీస్తూ అడపాదడపా వర్షాలు పడుతుండటంతో దాళ్వా వరికోతలు ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది వరిపంటకు తెగుళ్లు, దోమపోటు అంతంత మాత్రంగా ఉండటంతో దిగుబడులు బాగానే వస్తాయన్న రైతులు ఆశతో ఉన్నారు. వేడికంటే సమయంలో వర్షాలు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కోతలు మరింత ఆలస్యం అవుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

ఆలమూరు సబ్ డివిజన్‌లో 55వేల ఎకరాల్లో వరిసాగు: ఈ ఏడాది సబ్‌డివిజన్ పరిధిలో ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలో 55వేల ఎకరాల్లో దాళ్వా వరిసాగు జరుగుతోంది. దాదాపుగా అన్ని మండలాలలో వరికోతలు మొదలయ్యాయి. వారం రోజులుగా వాతావరణ మార్పులతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నది.

వాయిదా వేసుకుంటూ వస్తున్నారు

కె.నాగేశ్వరరావు, ఏడీఏ ఆలమూరు సబ్‌డివిజన్

వారం పది రోజులుగా వాతావరణంలో ఏర్పడుతున్న పరిస్థితులతో దాళ్వా కోతలు వాయిదా వేయాలని రైతులను కోరుతున్నాం. అయితే పంట పక్వానికి రావడంతో గింజరాలిపోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కొందరు రైతులు యంత్రాలతో వరికోతలు ప్రారంభించారు. కొంతైతే వాయిదాలు వేసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశాం.

ఈదురుగాలులతో లంక గ్రామాలకు భారీ నష్టం: ఆలమూరు మండలం లంక గ్రామాలలో మంగళవారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులు, వర్షాలకు లంక గ్రామాలలో భారీ నష్టం కలిగించింది. లంక గ్రామాలలో వాణిజ్య పంటలు అధికంగా ఉండటంతో ఈదురు గాలులకు అరటి పంటకు భారీ నష్టం కలిగించింది. కొబ్బరి తదితర చెట్లు విద్యుత్ వైర్లపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ లేక లంక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ సరఫరాకు ట్రాన్స్‌కో అధికారులు శ్రమిస్తున్నారు.

మరో రెండు రోజులు కోతలు కోయవద్దు

ఏడీఏ రంగారావు

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం ఎండగా ఉండటంతో ఇప్పటికే కోతలు కోసిన వరి రైతులు ధాన్యం తేమశాతం తగ్గించుకునేందుకు ఆరబెట్టుకున్నారు. మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యం తడవకుండా



ఆలమూరు మండలంలో వరి పంటను బరకాలతో కప్పు తున్న రైతులు

బరకాలు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేశారు. భారీ వర్షం కావడంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశుల వద్దకు నీరు చేరుకుంది. ఇప్పటికే కోతకు వచ్చిన పంట ఈదురు గాలులకు, వర్షానికి పడిపోతున్నాయి. దీనివల్ల కోత కోసే సమయంలో ఎక్కువ సమయం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో రెండు రోజులు కోతలు కోయవద్దు: పంట మాసూళ్లకు అనుకూలంగా లేదని, మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని రామచంద్రపురం వ్యవసాయశాఖ ఏడీఏ ఏవీ రంగారావు అన్నారు. మంగళవారం ఆయన కుందూరు గ్రామంలో పర్యటించారు. తేమశాతం తగ్గించుకునేందుకు రైతులు ఆరబెట్టిన ధాన్యం పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వ్యవసాయ శాఖ మండల అధికారి బలుసు రవి, ఏపీపీ పావని తదితరులు ఉన్నారు.

ఆకస్మిక వర్షాలకు రైతుల్లో కలవరం

మండపేట, (ఆంధ్రజ్యోతి): పంట చేతికందే సమయంలో ఆకస్మిక వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండపేటతోపాటు మండలంలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టుకోగా ఆకాల వర్షానికి తడిసి ముద్దయింది. ఆకస్మిక వర్షం, ఈదురుగాలులకు కలిసోస్తే కుసుకు లేకుండా చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, చాలాచోట్ల ఈదురుగాలులకు వరిచేలు నేలనంటుతున్నాయి. వారం రోజులు వాతావరణం అనుకూలిస్తే గట్టెక్కుతామని రైతులు చెబుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రాయవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన తెలిపారు. మంగళవారం రాయవరంలో ఎంపీడీవో మాట్లాడారు. లబ్ధిదారుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయ్యి ఉండి కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని, 21 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్‌తో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతో వచ్చేనెల 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కపిలేశ్వరపురంలో...

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు వచ్చేనెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.లక్ష్మీకుమారి తెలిపారు. అర్హులు రైస్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ ఫోన్‌తో మీసేవ కేంద్రాలు లేదా గ్రామ సచివాలయాల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతలు, పథకం మంజూరుకు కావల్సిన అనుభవం తదితర సర్టిఫికెట్లతో దగ్గరలో ఉన్న నెట్ సెంటర్ లేదా గ్రామ సచివాలయం ద్వారా వచ్చేనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్రిజ్‌లు విరాళం

ఆలమూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్రిజ్‌లు విరాళంగా ఇచ్చారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు మంగళవారం వాటిని అందజేశారు. చిన్నారులకు అందించే ఆహార పదార్థాలు పాడైపోకుండా ఉండేందుకు వీటిని అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మగ్గం పనులు పరిశీలిస్తున్న మాచర పాఠశాల విద్యార్థినులు

వృత్తివిద్య నైపుణ్యంపై ఆసక్తి పెంచుకోవాలి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య నైపుణ్యాల పట్ల విద్యార్థులంతా ఆసక్తి పెంచుకోవాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా బాలికావిద్య అభివృద్ధి అధికారి ఎం.బి.భీమారావు అన్నారు. మండలంలోని మాచర ఉన్నత పాఠశాలలో వృత్తివిద్య కోర్సుల్లో భాగంగా మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతనెల 29న నిర్వహించిన వృత్తివిద్యా పరీక్షకు టెక్స్ విద్యార్థులు హాజరయ్యారని వీరికి పాఠశాలలోని వృత్తివిద్య శిక్షకులు టి.లలిత, ఎన్.శ్రీనుబాబుల పర్యవేక్షణలో 12రోజులపాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమాదేవి, జిల్లావృత్తివిద్య కోఆర్డినేటర్ కె.రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన చీకురుమెల్లి కిరణ్‌కుమార్ ప్రతిభ చాటి రెండు పతకాలు సాధించారు. పవర్‌లిఫ్టింగ్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 74కిలోల మాస్టర్ విభాగంలో ద్వితీయస్థానం, పవర్‌లిఫ్టింగ్‌లో తృతీయ స్థానం సాధించి రజత, కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం జేకే ఫిట్‌నెస్ జిమ్‌లో జరిగిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌ను డి.గోపీకృష్ణ, డాక్టర్ కాండ్రేగుల శ్రీధర్, డాక్టర్ కవలి ప్రసాద్, డాక్టర్ శివశంకర్, ఎస్.మణికంఠ, డి.మణికంఠ, రమణ తదితరులు అభినందించారు.



పారిశుధ్య కార్మికులకు కేటాయించిన వాటర్ వర్క్సులోని చెత్త సంపద కేంద్రం షెడ్

చెత్త సంపద కేంద్రంలో వారికి ఆవాసమా?

• అధికారుల తీరుపై పారిశుధ్య కార్మికుల అసంతృప్తి • సౌకర్యాల్లేవని ఆవేదన

మండపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం వాటర్ వర్క్సులో ఉన్న చెత్త సంపద కేంద్రం, పారిశుధ్య కార్మికుల ఆవాస కేంద్రంగా మారిపోయింది. పట్టణంలో పని చేసేందుకు వచ్చే తాత్కాలిక కార్మికులు తలదాచుకునేందుకు వాటర్ వర్క్సులో ఉన్న ఈ కేంద్రాన్ని ఎంపిక చేశారు. దీంతో వారంతా ఇక్కడున్న స్తంభాలకు చీరలు కట్టుకుని పగలు పని చేసుకుంటూ రాత్రివేళల్లో అక్కడే దీకట్లో తలదాచుకుంటున్నారు. అధికారులు ఏసీ గదుల్లో ఉంటుంటే పారిశుధ్య కార్మికులను చెత్త సంపద కేంద్రంలో ఉండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో మున్సిపాల్టీకి చెందిన భవనాలు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. వారికి వాటిని ఇవ్వకుండా చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రంలో తలదాచుకునేలా ఇవ్వడం ఎంత వరకు సమంజసమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రావులపాలెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పేద ప్రజల ఆర్థికస్తోమతను మించి వైద్యం చేయించుకుంటున్న తరుణంలో వారికి సహాయనిధి ద్వారా తిరిగి బిల్లులు అందించి పేదలకు అండగా సీఎం చంద్రబాబు నిలుస్తున్నారని అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 58 మందికి రూ.43,23,943 సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



చెల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

చెల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాయవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, కూటమి నేతలు గొల్లపల్లి వెంకటరమణ, వల్లూరి సత్యప్రసాద్, బలుసు వీవీ సత్యనారాయణ, ముత్యాల రాజు, గొడిమి చిన్న, సీతావ ఎం.వెన్నెల, ఏపీఏ ఎస్.కృష్ణతేజ, ఎస్.శివాజీ, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలో స్నానాలు.. ప్రాణాలతో చెలగాటం



ఆత్రేయపురం మండలం లొల్లలాకుల వద్ద కాలువలో స్నానాలు చేస్తున్న యువకులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవి వేడిని తట్టుకోలేక పలువురు విద్యార్థులు సమీపంలోని కాలువల్లో స్నానాలు చేస్తూ ఉపశమనం పొందుతున్నారు. ఇటీవల పది పరీక్షలు రాసిన విద్యార్థులు సమీపంలోని కాలువల్లో స్నానాలు చేస్తూ కేరింత లతో సందడి చేస్తున్నారు. లొల్ల లాకుల వద్ద ర్యాలి, మెర్లపాలెం వంతెనల వద్ద పలువురు యువకులు ఈతకొడుతూ ఇలా కనిపించారు. కాలువల్లో స్నానాలు చేస్తున్న వీరంతా ప్రాణాలకు ముప్పు తెస్తున్నదన్న విషయం మరిచిపోతున్నారు. గత వేసవిలో గోదావరి, కాలువల్లో స్నానాలు చేస్తూ పలువురు మృత్యువాతపడ్డారు. కాటన్ బ్యారేజీ వద్ద స్నానాలు చేయకుండా పోలీసు యంత్రాంగం నిలువరించారు. ఆయా ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి స్నానాలను చేయకుండా కట్టడి చేయాలని పలువురు సూచిస్తున్నారు.



గోపాలపురంలో గోగులమ్మ జాతర సందర్భంగా ఆకట్టుకున్న గరగనృత్యాలు

ఘనంగా గోగులమ్మ జాతర

రావులపాలెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గోపాలపురం గ్రామదేవత గోగులమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగనృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఈ జాతరను వైభవంగా నిర్వహించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల అందచేత

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20, 21, 22 వార్డులలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ ఇతర సభ్యులకు సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా కోటికిపైగా సభ్యత్వాలు నమోదు చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ కార్డులు త్వరితగతిన పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న డాక్టర్ సోమశేఖర్

పాఠశాలలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం కంప్యూటర్, ప్రింటర్, యూపీఎస్ బ్యాటరీలను బహూకరించారు. కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి 1975-76 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విశ్రాంత పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ గుత్తుల సోమశేఖరం వారి తల్లిదండ్రులైన గుత్తుల కృష్ణమూర్తి, సుబ్బలక్ష్మి, సోదరుడు శ్రీనివాస్ జ్ఞాపకార్థం సుమారు రూ.60వేల విలువ చేసే వీటిని పాఠశాల హెచ్ఎం వంగా శ్రీనివాస్ ఇటీవల సోమశేఖరం దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన పాఠశాలకు వీటిని బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.తాతారావు, పశువైద్యాధికారిణి డాక్టర్ వీవీ రమణమూర్తి, హెచ్ఎం శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ కొప్పిశెట్టి సతీష్, విశ్రాంత టీచర్ కుప్పాల సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.